
# అక్షర సత్యం



సాయంత్రపు వేళ........

రోడ్డు పక్క ఫుట్‌పాత్ మీద నడుస్తున్నాను... నడకంటే నాకు ఇష్టం !

ఉదయం, సాయంత్రం, రోడ్డు మీద రెండు మూడు కిలోమీటర్లు నడిస్తే గానీ నాకు నిద్రపట్టదు. అలాగని నాకేమీ అనారోగ్యం లేదు ! ముఖ్యంగా నేటి తరాన్ని పట్టి పీడిస్తోన్న మధుమేహం, రక్తపోటు లాంటి వ్యాధులేవి లేవు నాకు... !

రోడ్డు మీద ఒంటరిగా, అలా నడుస్తూ పోతూంటే ఎన్నో జీవన దృశ్యాలు నాకళ్ళ కెమెరాలో బంధించబడుతుంటాయి. ఆ దృశ్యాలన్నీ నా ఆలోచనలతో మమైకం చెందుతుంటాయి. ఒక వైపు ఆనందం... మరోవైపు ఆవేదన, నా మనసును కవ్వంలా చిలుకుతుంటాయి. ఆమథనంలో మంచీ, చెడూ, న్యాయం, ధర్మం, కష్టం, సుఖం, లేమీ, కలిమీ లాంటి భావాలకు కొత్త అర్థాలు స్ఫురిస్తూ ఉంటాయి. విచక్షణతో నాలో వివేకాన్ని మేల్కొల్పుతుంటాయి. నావ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దుతుంటాయి...!

అందుకే నాకు నడకంటే చాల ఇష్టం !

యధాప్రకారం రోడ్డు రద్దీగా ఉంది. వాహనాల రణగొణ ధ్వనులకి చెవులే కాదు. గుండెలూ అదురుతున్నాయి. మసీదు సెంటరులో తెల్లటోపీ పెట్టుకున్న పోలీసు, ఈ జనాల్నీ, వేగాల్నీ నియంత్రించడం నావల్ల కాదురా బాబో అన్నట్టుగా తెల్లమొహం వేసుకుని చూస్తున్నాడు.

ఫుట్‌పాత్ మీద నెమ్మదిగా అడుగులు వేస్తున్నాను. పేరుకు పాదచారుల కోసం, ఫుట్‌పాత్‌లే గానీ, సగానికి పైగా స్థలం చిన్నరకం చిల్లర దుఖాణాలతో నిండిపోయి ఉంది. వాళ్ళు పెట్టే గోల రకరకాల వాద్యాల స్వరసమ్మేళనంలా వినబడుతోంది. ఆ జనం మధ్య తోసుకుంటూ, రాసుకుంటూ ముందుకు నడుస్తున్నాను... !

"సార్ ! సార్ !" ఎవరో పిలిచినట్టయి వెనక్కి తిరిగాను.

పన్నెండేళ్ళ కుర్రాడు... చామన ఛాయలో సన్నగా ఉన్నాడు. నీలరంగు నిక్కరులో తెల్లటి చొక్కా దోపుకున్నాడు. నిక్కరూ చొక్కా మాసి ఉన్నాయి. తలకు నూనె లేకపోయినా, పక్కకు దువ్వుకున్నాడు. చొక్కా జేబులో చిన్న బాల్ పెన్ను ఉంది. చేతిలో ఏవో రెండు పుస్తకాలు ఉన్నాయి. "చదువుకుంటు న్నాను సార్ నోట్సులు కొనుక్కోవాలి. ఏవైనా సాయం చెయ్యండి సార్!" ఆ కుర్రాడు

ప్రాధేయపడుతూ రెండు చేతులూ జోడించాడు. నేను వినీ విననట్లుగా ముందుకు నడుస్తున్నాను.

"సార్ ! సార్ ! మాది చాలా పేద కుటుంబం సార్! నాకు నాన్నలేడు సార్! మా అమ్మ నన్ను చదివిస్తోంది సార్ ! పుస్తకాలు కొనుక్కోవాలి సార్. ! మీకు పుణ్యం ఉంటుంది సార్ ! సాయం చెయ్యండి సార్!"

ఆ కుర్రాడు నా వెంట బడుతూ నన్ను వదలటంలేదు...

నేనో దీప స్తంభం దగ్గర ఆగిపోయాను. ఆ కుర్రాడి అభ్యర్థనలో, ఆకారంలో, ఏదో నిజాయితీ ఉన్నట్లే అనిపించింది.

"నీ పేరేంటి...?"ఆలోచనగా అడిగాను.

"సత్యం - అండీ !"

'ఏ స్కూలు మీది. ఏం చదువుతున్నావు....?'

"మునిసిపల్ హైస్కూల్లో ఆరవ తరగతి చదువుతున్నానండీ !"

"చూడు సత్యం .... నేను నీకు డబ్బులివ్వను. నీక్కావల్సిన నోటు పుస్తకాలు కొనిపెడతాను సరేనా....?"

"సరేనండి !" సత్యం ముఖంలో సంతోషం వ్యక్తమయింది. కళ్ళల్లో కృతజ్ఞత వెల్లివిరిసింది. సత్యాన్ని నాకు తెలిసిన పుస్తకాల దుఖాణానికి తీసుకువెళ్ళాను.

"ఎన్ని నోట్సులు కావాలి నీకు... ?"

"రెండొందల పేజీలు మూడు, వంద పేజీలు నాలుగు కావాలండి !"

పాతిక రూపాయలు చెల్లించి, ఆ నోట్సు పుస్తకాలు తీసుకున్నాను.

"శ్రద్ధగా చదువుకుని, బాగా మార్కులు తెచ్చుకో ! ఏం ?"

ఆ పుస్తకాల్ని సత్యం చేతిలో పెట్టాను.

'మీ మేలు మరచిపోలేను సార్ ! మీరు చెప్పినట్టే చదువుకుంటాను సార్ ! వస్తాను సార్ !'

సత్యం నాకు మరోసారి వినమ్రంగా నమస్కరించి పుస్తకాలు తీసుకుని వెళ్ళిపోయాడు. గబ గబా నడిచిపోతూ జనంలో కలిసిపోయిన ఆ కుర్రాడ్ని రెండు నిముషాలు నిర్నిమేషంగా చూసి నేను ముందుకు సాగిపోయాను. మనసెందుకో తృప్తిగా నిట్టూర్చింది. ఈ రోజు ఒక మంచి పని చేశానన్న భావన అణువణువునా, మంచి గంథంలా పరిమళించింది.

జగన్నాథపురం బ్రిడ్జి వరకూ నా నడక సాగిపోయింది. బ్రిడ్జి మీద మిత్రుడు శరభారావు కలిస్తే ఆయనతో, లోకభిరామాయణం అరగంట గడిచిపోయింది. లోకం చీకటి దుప్పటి కప్పుకుంటోంది.

శరభారావు శివాలయం వైపు వెళ్ళొస్తాననీ అడుగులు వేస్తే నేను తిన్నగా ఇంటికి బయలుదేరాను. బజారు బహు సందడిగా ఉంది. రోడ్డు పొడవునా దీపాలతోరణాలు, ఏవో దివ్యస్వప్న లోకాలకు దారుల్లా, బారులు తీరి మెరుస్తున్నాయి.

మసీదు సెంటరుకు తిరిగి నడిచివచ్చాను.

"ఏవండోయ్ ! మిమ్మల్నే !" అన్న పిలుపు వినబడి, నన్నా, కాదా అనుకుంటూ అటూ ఇటూ చూశాను. పుస్తకాల షాపువాడు నన్ను చేయెత్తి పిలుస్తున్నాడు. ఆశ్చర్యంతో అతని వద్దకు వెళ్ళాను!

'ఏవిటి సార్ ఇంతకు ముందు మీరుకొన్న నోట్సుపుస్తకాలు, ఆ కుర్రాడు తిరిగిచ్చేసి డబ్బులు పట్టుకుపోయాడు. ఎవరా కుర్రాడు... ? మీవాడేనా...'

నా నోట్లోంచి మాట రాలేదు. ఆ కొట్టువాడికి జవాబు ఏం చెప్పాలో తోచలేదు... !

సత్యం నోట్సు పుస్తకాలు తిరిగిచ్చేసి డబ్బులు పట్టుకుపోయాడా...? ఎంత మోసం...? చదువుకుంటున్నానీ, దిక్కులేని వాడిననీ ఎంతదీనంగా వేడుకున్నాడు ? ఎంత చక్కగా నటించాడు...?

చేసిన సహాయం నిష్ప్రయోజనమైపోయిందా ? ఎక్కడ పొరబడ్డాను నేను ?

'ఆ ! వాడు మా బంధువుల పిల్లవాడే సార్! బహుశా ! వాళ్ళమ్మ పుస్తకాలు ముందే కొనేసిందేమో! అందుకే తిరిగిచ్చేసి ఉంటాడు. వస్తానండీ !'' కొట్టు వాడికి సమాధానం చెప్పి చరచరా ముందుకు నడిచాను.

మనసెందుకో వికలమయిపోయింది... !

కళ్ళల్లో సత్యం రూపం కదులుతోంది. వాడి మాటలోని దీనత్వం చెవుల్లో ప్రతిధ్వనిస్తోంది. పాతిక రూపాయిలు వృథాగా ఖర్చు పెట్టానా...? ఖర్చు పెట్టినందుకు నాకు బాధలేదు. వాడు చదువు కుంటున్నాననీ అబద్ధం చెప్పినందుకు మనస్తాపంగా ఉంది.

సత్యం ఈ జనంలో ఎక్కడైనా కనిపిస్తాడా...? ఈ రోజు కాకపోతే మళ్లీ ఎప్పుడైనా ఎక్కడైనా నా కళ్ళల్లో పడతాడా ? జనంలో అన్ని వైపులా కలయ చూస్తూ నడుస్తున్నాను. దాదాపు ఇంటి సందు వరకూ నడిచి వచ్చేశాను. రోడ్డువైపు మలుపు తిరగబోతూ ఉంటే ఎదురుగా వినాయకుడి గుడి ముందు బజ్జీల బండి దగ్గర ఎవరో కుర్రాడు తెల్లటి చొక్కా, నీలం రంగు నిక్కరు ! వాడు సత్యమేనా...?

ఒక్క ఉదుటన రోడ్డు దాటి బండి దగ్గరకు వెళ్ళాను.

వాడు సత్యమే ! వేడి వేడి బజ్జీలు కరకరా నమిలి తింటున్నాడు. నన్ను చూడలేదు. వాడు బజ్జీలు తినడం పూర్తయ్యే వరకూ అక్కడే నిలబడ్డాను.

"ఏయ్ ! సత్యం ! ఇలారా !'' మామూలుగా పిలిచాను.

సత్యం నన్ను చూశాడు. ఏమీ తడబడలేదు. చేతులు కట్టుకుని నా ముందుకు వచ్చి నిలబడ్డాడు.

'నేను కొన్న నొట్పులు ఏవీ...? ఏం చేశావు...?' కోపాన్ని అణచిపెట్టుకున్నాను.

"మా అమ్మకు ఇచ్చేశాను సార్ ! ఇంటి దగ్గర ఉన్నాయి సార్!''...!!

"మరో మాట మాట్లాడావంటే... నీ చెంపలు వాయించేస్తాను. నువ్వు చెప్పేదంతా అబద్ధం. ఆ పుస్తకాల్ని తిరిగిచ్చేసి డబ్బులు తీసుకున్నావు అవునా... కాదా... ?''

సత్యం పెదవి విప్పలేదు. మౌనం, అంగీకారం అన్నట్టుగా అలాగే నిలబడ్డాడు. "ఎందుకలా అబద్దాలు చెప్పడం...? ఈ వయసులోనే ఇన్ని అబద్దాలు చెబితే రేపు భవిష్యత్తులో ఎలా తయారవుతావో...? అసలు నువ్వు చదువు కుంటున్నావా లేదా...? సమాధానం చెప్పు....? గొంతు పెంచి, గద్దించి అడిగాను. కొన్ని క్షణాలు మౌనం ! సత్యం గొంతు విప్పాడు.

"నేను చదువుకోవడంలేదు సార్... ఆకలేస్తుంది. అంటే ఎవరూ సాయం చెయ్యడం లేదు సార్ ! అందుకనీ...''

"ఎవరూ సాయం చెయ్యకపోతే... ఏ కొట్లోనో... హోటల్లోనో పని చేసుకుని బ్రతకాలి... అంతేగాని అబద్దాలు చెప్పడం, మోసం చెయ్యడం తప్పు కదూ...?''

"హోటల్లో పనిచేశాను సార్ ! వారం రోజులు పనిచేసే సరికి జ్వరం వచ్చేసింది సార్ ! పది రూపాయలు మందుల కోసం అడిగితే ఆ మేనేజరు పో పొమ్మన్నాడు సార్ ! నెలరోజులు బ్రాందీ కొట్లో పనిచేశాను సార్ ! ఒక రోజు, ఆ కొట్టాయన దొంగతనం మోపి చితక్కొట్టి బయటికి గెంటేశాడు సార్ !'' సత్యం కళ్ళల్లో నీళ్ళు... దుఃఖస్వరం...! నా మనసు మెత్తబడిపోయింది. అయినా ఉక్రోషం ఆగలేదు. "ఒక్క అక్షరం ముక్క రాకపోయినా చదువు కుంటున్నాననీ అబద్ధం చెప్పడానికి,

అడుక్కోవడానికీ, నీకు సిగ్గుగా లేదూ...?"

సత్యాన్ని నిలదీసి అడిగాను.

"మీరు చదువుకున్నారా సార్...?" వాడు సూటిగా అడిగిన ప్రశ్నకు నాలో అభిమానం పొడుచుకొచ్చింది.

"నా చదువు సంగతి నీకెందుకు..?" పౌరుషంగానే అన్నాను.

"మీరు చదువుకున్నవారు. చదువు విలువ మీకు తెలుసు అందుకే నేను చదువుకుంటు న్నానంటే పాతిక రూపాయలు ఖర్చుపెట్టి నాకు నోట్సులు కొనిపెట్టారు. నాకు నిజంగా చదువుకోవా లని ఉంది సార్ ? నా కడుపుకింత తిండి పెట్టి చదువు నేర్పుతారా సార్...? మీ ఇంటికి వచ్చేస్తాను. రెండు పూటలు కాదు. ఒక్క పూట తిండి పెట్టినా చదువు నేర్చుకుంటాను సార్. నాకు చదువు నేర్పుతారా సార్...?"

నేను నిలువునా నీరయి పోయాను. సత్యానికి సమాధానం చెప్పే ధైర్యం నాకు కలగలేదు. నిజమే! 'అక్షరం' కంటే 'ఆకలి' ముందు పుట్టింది. ఆకలి తీరిన తరువాతే అక్షరం పిల్లల్ని వరిస్తుంది. ఇది 'అక్షర సత్యం!' అందుకేనేమో, ఆకలి తీర్చుకోవడం కోసం మనకళ్ళముందు కోకొల్లలుగా పిల్లలు! కార్ఖానాల్లో, దుఖాణాల్లో, ఫ్యాక్టరీల్లో, హోటళ్ళలో ఎక్కడ బడితే అక్కడ పనిభారంతో బాలకార్మికులు! వీళ్ళకూ, అక్షరానికీ మధ్య చాలా దూరం ఉంది. ఆ దూరాన్ని తగ్గించాలి. ఆకలి తీరే మార్గం కోసం సత్యం అబద్ధం చెప్పడంలో అసహజత్వం ఉందేమో కాని, అది నేరం కాదేమో...!

సత్యం ! అలా చూడు... ఆ సందు లోపలికి వస్తే పచ్చటి కటకటాల ఇల్లు కనపడుతుంది. అదే మా ఇల్లు. రేపు ఉదయం మా ఇంటికి ఒకసారి రా! ఏం వస్తావా...?"

'సత్యం' ఆశ నిరాశల మధ్య ఊగిసలాడు తున్నట్టుగా తల ఊపాడు. నేను రోడ్డు దాటి ఇంటివైపు అడుగులు వేస్తున్నాను...!

సత్యం ఆకలి తీర్చాలి; అక్షరం దిద్దించాలి.

సత్యాన్ని 'అక్షర సత్యం'గా మార్చే ఆలోచన నాలో బలంగా రూపుదిద్దుకుంటోంది...!

గీతాంజలి పక్ష పత్రిక
ఆగష్టు 1995